క్లుప్తంగా

నేడు తుళ్ళూరులో వైఎస్సార్ పెన్షన్లు పంపిణీ

తాడికొండ: నేడు మండల కేంద్రమైన తుళ్ళూరులో వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు హెచ్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమానికి తాడికొండ సమన్వయకర్త, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత హాజరు కానున్నారు. కావున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కట్టా హేమ సుందరరావు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి నగరంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కట్టా హేమ సుందరరావు, రాష్ట్ర 13వ మహాసభ కరపత్రాలను మంగళగిరి చేనేత వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు జొన్నాదుల వరప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి నగరంలో మార్కండేయ పద్మశాలి కళ్యాణ మండపంలో జనవరి 20, 21 తేదీల్లో రాష్ట్ర 13వ మహాసభలను నిర్వహించనున్నామని, పద్మశాలీయులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తూరి మోహనరావు, మంగళగిరి వస్త్ర ఉత్పత్తి విక్రయదారుల సంఘం అధ్యక్షులు (ఉప ప్రధాన కార్యదర్శి) పెండెం శివరామకృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి (ఆహ్వాన సంఘం కోశాధికారి) చిన్ని తిరుపతయ్య, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా హేమ సుందరరావు, గోల్డ్ స్మిత్ కట్టాబత్తుల శేషగిరి, గుంటూరు జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, గంజి శ్రీనివాసరావు, బండి నాగేంద్రరావు, బత్తుల గిరి పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ గంగానమ్మపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి బుధవారం రాత్రి నాలుగు క్వార్టర్ల మద్యం సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

బైకులు చోరీ చేస్తున్న యువకులపై కేసు

తెనాలిరూరల్: బైకులు చోరీ చేస్తున్న ముగ్గురు యువకులపై కేసులు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముగ్గురు యువకులు మంగళవారం అర్ధరాత్రి దాటాక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు అపహరించారు. గంగానమ్మపేట తోటకూర సుబ్బారావు నాయుడు హైస్కూలు వద్ద మరో బైక్ అపహరించేందుకు యత్నిస్తుండగా స్థానికులు గమనించి కేకలు వేయడంతో పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుధవారం రాత్రి తెలిపారు. నిందితుల్లో ఒక యువకుడి ఆచూకీ ఇప్పటికే పోలీసులు గుర్తించినట్టు తెలిసింది.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

తెనాలిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నందులపేట భాస్కరరావు దిబ్బకు చెందిన కోడూరి అనసూయ(60) భర్త మృతి చెందడం, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. ప్రైవేటు చిట్టీలు నిర్వహించే ఈమె ఆర్థిక ఇబ్బందుల కారణంగా మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు బుధవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు గుర్తింపు

- క్రీడాకారులు ప్రతిభ చాటుకునేందుకు మంచి అవకాశం
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి



యర్రబాలెం డాన్‌బాస్కో స్కూల్‌లో షటిల్ ఆడుతున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చిరంజీవి

తాడేపల్లిరూరల్ : ఆడుదాం ఆంధ్రా.. ఇది అందరి ఆట.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను గుర్తించి వారి ప్రతిభను వెలికితీసేందుకు ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారని ప్రతి ఒక్క క్రీడాకారుడు ఆడుదాం ఆంధ్రాలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని మాజీ మంత్రి, ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూల్, తాడేపల్లి బ్రహ్మానందపురం, తాడేపల్లి రూరల్ ఉండవల్లిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సెక్రటరీ శ్రీనివాసరావులతో కలసి ఆటల పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో నిర్వహించని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా.. ఇది అందరి ఆట పేరుతో వార్డు, గ్రామాల వారీగా ఐదు రకాల ఆటల పోటీలను నిర్వహిస్తున్నారని, ఒక్క ఎంటీఎంసీలోనే క్రీడల్లో పాల్గొనేందుకు 19వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని, యువత ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఆడుతున్నారని ఎంతోమంది తమ సచివాలయ పరిధిలో ప్రతిభను చాటి మండల స్థాయికి ఎంపికయ్యారని అన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు భారం కాకూడదని ప్రభుత్వమే క్రీడా కిట్లను అందజేస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్‌సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, చేనేత విభాగం కార్యదర్శి గుండా మధు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండల పరిధిలో....

దుగ్గిరాల మండల పరిధిలోని 18 సచివాలయాల్లో బుధవారం అంగరంగ వైభవంగా ఆడుదాం ఆంధ్రా ఇది అందరి ఆట పోటీలు ప్రారంభమయ్యాయి. దుగ్గిరాల మండలం పెరుకలపూడిలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ఎండివో వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సచివాలయాల వారీగా ఉత్సాహంగా ఆటల పోటీలు జరుగుతున్నాయని, యువతీ యువకులు భారీగా పాల్గొంటున్నారని, ప్రతి సచివాలయం పరిధిలో క్రీడలు ఆడుతున్న వారిని సచివాలయ సిబ్బంది అన్ని సౌకర్యాలు కల్పించారని, నిరంతరం పిఇటిలు ఆటల పోటీలను పరిశీలిస్తూ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు.

తండ్రి బాటలోనే తనయుడు

- ముఖ్యమంత్రి జగన్ రాకతో వైద్యరంగంలో పెనుమార్పులు
- ఇంటివద్దనే అందుతున్న వైద్య సేవలు

తాడేపల్లిరూరల్ : ఆనాడు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రూపాయికే వైద్యం చేశారు. ఈనాడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి ఇంటివద్దే ఉచిత వైద్యాన్ని అందిస్తున్నారని మాజీ మంత్రి, ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని బేతపూడి, మంగళగిరి, ప్రాతూరు తదితర ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, ఎంటీఎంసీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డితో కలసి పరిశీలించి జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, సంక్షేమ పథకాల రథసారథి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయాల్లో ప్రవేశించక ముందే డాక్టర్‌గా పనిచేసి, రూపాయికే వైద్యం చేసి ప్రజల మన్ననలు పొందారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తరువాత వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పాదయాత్రలో తెలుసుకుని 108, ఆరోగ్యశ్రీలను ప్రవేశపెట్టి ఎంతోమంది పేదల ప్రజలకు ఉచిత వైద్యం చేయించి దేవుడయ్యాడు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ ఆరోగ్యశ్రీని ప్రజలకు మరింత చేరువ చేసి ప్రతి 30 వేల మందికి వైఎస్సార్ అర్బన్ సెంటర్లను నిర్మించి అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్నారు. ఎంతోమంది గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కోల్పోవడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఇంటికి నేరుగా ప్రభుత్వ వైద్యులను పంపి వారికి వున్న ఆరోగ్య సమస్యలను తెలుసుకుని జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో కంటి సమస్యలతో పాటు, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. కార్యక్రమంలో డి.ఇ.కృష్ణారెడ్డి, ఎ.ఇ.కిషోర్, ప్రభుత్వ వైద్యులు, స్టాఫ్ నర్సులు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి, తాడేపల్లి రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సంకురు మరియబాబు, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రాతూరు మేరిరాణి, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి గుండా మధు, జంగా రత్నం, ప్రాతూరు శ్రీనివాసరావు, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చిరంజీవి



దుగ్గిరాలలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్, మంగళగిరి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోను, దుగ్గిరాల మండల పరిధిలోని మండల కార్యాలయంతో పాటు పలు గ్రామాల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మంగళగిరిలో..

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవిలు హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి, మహిళా హక్కుల కోసం విశేష కృషి చేసిన ఘనత సావిత్రిబాయి పూలేదేనని అన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సావిత్రి బాయి పూలే జయంతి వేడుకల్లో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు పాల్గొన్నారు. ముందుగా మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవరపల్లి వీరయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), మైనార్టీ నాయకులుషేక్ సుభాని, గ్రామ ఉప సర్పంచ్ షేక్ నాగూర్, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యకు కృషిచేసిన సావిత్రీబాయిపూలే

ఫిరంగిపురం: మహిళల విద్యకు సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని తల్లిదండ్రుల విద్యాకమిటీ చైర్మన్ పులకాన రామిరెడ్డి అన్నారు. మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, హెచ్ఎం దివి కమల్‌మోహన్, రవిశేషు, భారతీ, ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో పలు సచివాలయాలను ఎంటీఎంసీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి బుధవారం సందర్శించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్, క్రిస్టియన్ పేట, నవోదయ కాలనీలోని సచివాలయాలను సందర్శించి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అనే విషయాలను, కొత్తగా ఎంతమంది లబ్ధిదారులు నమోదయ్యారు వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోగుల శ్రీను, సచివాలయ కన్వీనర్ కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, కళ్యాణ్, రొడ్డ ఎలీషా, బుగ్గయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ శాస్త్ర కోర్సుల నూతన భవనానికి శంకుస్థాపన

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ పేరుతో నిర్వహిస్తున్న న్యాయ శాస్త్ర కోర్సుల నూతన భవన నిర్మాణానికి బుధవారం వీసీ పి.రాజశేఖర్ శంకుస్థాపన చేశారు. వర్సిటీలో ఎస్ఎస్ఎస్ భవనానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈ భవనం నిర్మాణం చేపడుతున్నారు. సుమారు రూ.10.94 కోట్ల అంచనాతో ఈ భవనాన్ని సీపీడబ్ల్యూడీ నిర్మించనుంది. శంకుస్థాపన కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, పాలకమండలి సభ్యులు సిహెచ్.స్వరూపరాణి, ఆచార్య కె.సుమంత్ కుమార్, ఆచార్య జగదీష్ నాయక్, డాక్టర్ షాహేద అక్తర్, వి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్ కె.గంగాధర్ రావు, ఎ.ప్రమీలరాణి, ఓఎస్డీ కె.సునీత, సీడీసీ డిన్ కె.మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, చీఫ్ ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను వెలుగులోకి తెచ్చిన సీఎం జగన్

- దుగ్గిరాల ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ
- విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ, సిస్టర్ థెరసమ్మ

తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే ప్రభుత్వ బడులు వెలుగులోకి వచ్చాయని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల గ్రామంలో నిమ్మగడ్డ ఫౌండేషన్ బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇంగ్లీష్ మీడియం విద్య ప్రవేశపెట్టారని, నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను పరిశీలించారు. కార్యక్రమంలో బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి, హెచ్ఎం జి.బాల సుందరం, పాఠశాల కమిటీ చైర్మన్లు కోమలి, పద్మ, మైనార్టీ నాయకులు షేక్ సుభాని, ఉపాధ్యాయులు సతీష్, కృష్ణకుమారి, అజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యం

ఫిరంగిపురం: క్రమశిక్షణతో కూడిన విద్యద్వారానే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలకేంద్రంలోని సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విద్యకోసం ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వారికి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాప్రదాత సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, పెరికల జేమ్స్ ఇన్నయ్య, హెచ్ఎం సిస్టర్ ఒట్టి థెరసమ్మ, పీఈటీ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని మోదీ నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో పరీక్షా పే చర్చా కార్యక్రమ నమోదుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఏపీసీ విజయలక్ష్మి చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో ఆన్‌లైన్‌లో పరీక్షా పే చర్చకు స్వయంగా నమోదు చేయించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పరీక్షా పే చర్చా కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడే అవకాశాన్ని విద్యార్థులు పొందుతారని చెప్పారు. అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థులను నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల హెచ్ఎం బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

రజక కళ్యాణ మండప నిర్మాణం పూర్తికి వినతిపత్రం



ఎంటీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని రజక దోబీఖానా స్థలంలో అమరజీవి చిట్యాల ఐలమ్మ రజక కళ్యాణ మండప నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్‌కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వర్లు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి 17వ వార్డులో రజక దోబీఖానా స్థలంలో అమరజీవి చిట్యాల ఐలమ్మ రజక కళ్యాణ మండపం నిర్మాణం కొరకు రూ.1 కోటి 20 లక్షలతో నిర్మాణం ప్రారంభించారని, అయితే నిర్మాణ పనులు పూర్తి కాలేదని, నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని వినతి పత్రం అందజేశామన్నారు. స్పందించిన కమిషనర్ నిర్మల్‌కుమార్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌లతో చర్చించి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు స్వయంగా పరిశీలించి తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, జిల్లా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కం ఇస్త్రీ దారుల సంఘం ప్రధాన కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు, రజక వృత్తిదారుల సంఘం ఉండవల్లి గ్రామ గౌరవ అధ్యక్షులు ఉండవల్లి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను అంతా సద్వినియోగం చేసుకోవాలని తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంప్‌ను బుధవారం చినరావూరులో ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషలిస్టు వైద్యులు అక్కడ సేవలు అందించారు. మెడికల్ క్యాంప్‌కు వచ్చిన ఆమె అక్కడ అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులను ఇక్కడకు తీసుకొచ్చి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. జనరల్ ఓపీలో 62 మందికి, గైనిక్-22, జనరల్ మెడిసిన్-54 మందికి వైద్య సేవలు అందించినట్లు మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె హెలెన్ నిర్మల తెలిపారు. అనంతరం రోగులకు మెడిసిన్ కిట్‌లను డాక్టర్ అన్నపూర్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొర్రా యశోద, వైద్యులు డాక్టర్ దివికృష్ణకిషోర్, డాక్టర్ పి ఉషారాణి, డాక్టర్ వి లిఖిత, డాక్టర్ టి వినీల్, డీపీఎంవో జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ- ఆటో రిక్షా ప్రారంభం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నూతనంగా కొలుగోలు చేసిన ఈ- ఆటో రిక్షా ను బుధవారం వీసీ ఆచార్య పి రాజశేఖర్ ప్రారంభించారు. పూర్తిగా బ్యాటరీతో నడిచే ఈ వాహనం ద్వారా గార్బేజ్ క్లీనింగ్ చేయనున్నారు. సుమారు రూ.2 లక్షలతో కొనుగోలు చేసిన ఈ వాహనం ద్వారా వేగవంతంగా పనులు చేసే అవకాశం ఉంటుందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వర ప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఓఎస్డీ కె.సునీత, ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీల అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ- డీఎల్‌టీసీల సిబ్బంది అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను ప్రాంతీయ ఉప సంచాలకుడు ఎస్‌వీవీ ఆంజనేయులు ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ, జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ కేంద్రం (డీఎల్‌టీసీ)లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమర్తలూరి యోబు, కార్యదర్శి బండి రమేష్‌బాబు, రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ సభ్యులు, వివిధ ఐటీఐల సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌గా రవికిషోర్

తెనాలి: తెనాలి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్‌గా శొంఠి రవికిషోర్ బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. కొత్తపేటలోని ప్రధాన పోస్టల్ కార్యాలయం ఆవరణలో గల సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయనకు పోస్టల్ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. రవికిషోర్ తెనాలి పోస్టల్ డివిజనులోనే గతంలో పోస్టల్ అసిస్టెంట్‌గా, పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం విజయవాడ నార్త్ సబ్‌డివిజన్ ఏఎస్‌పీగా చేస్తూ, అడ్‌హాక్ ప్రమోషన్‌పై తెనాలి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు.